క్లుప్తంగా

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మల్దకల్: రోగుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపారాణి, జయమ్మలు సూచించారు. శుక్రవారం మల్దకల్ పీహెచ్‌సీలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పోషకాలు ఎక్కువగా ఉండే పాలు గుడ్లతో పాటు ఆకుకూరలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో పంపిణీ చేసే పౌష్టికాహారం గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

మానవపాడు: ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అమరవాయి గ్రామంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. మండలం గుండా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాదారులు హెల్మెట్ ధరించాలని తెలిపారు. రోడ్లపై పరిమితికి మించి వాహనాలు నడుపరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అల్లీ సాహెబ్ ఉర్సు పోస్టర్ విడుదల



అయిజ: మండలంలోని కిష్టపురం గ్రామంలో సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్న అల్లీ సాహెబ్ ఉర్సు పోస్టర్లను శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు రాముడు ఉర్సు నిర్వహించేందుకు రూ.30 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు ఉరుకుంద, రాముడు, మద్దిలేటి, వెంకటన్న గౌడ్, గట్టన్న, మధు, నరేష్, మోహన్ బాబు, రవి, మద్దిలేటి, మౌలాలి, నరసింహులు, తిమ్మయ్య పాల్గొన్నారు.

కారుకు నిప్పు: కేసు నమోదు

గద్వాల క్రైం: పాతకక్షలు మనుస్సులో పెట్టుకుని కారుకు నిప్పుపెట్టిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. కృష్ణారెడ్డి బంగ్లాకు చెందిన బోయ వరలక్ష్మికి వడ్డె శ్రీనివాసుల కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు ఉన్నాయి. పాత కక్షలు మనస్సులో పెట్టుకుని శుక్రవారం తెల్లవారుజామున ఇంటి ముందు కారును పార్క్ చేయగా, సదరు వ్యక్తి కారుకు నిప్పంటించాడు. ఈ సంఘటనపై బాధితురాలు వడ్డె శ్రీనివాసుపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వినతిపత్రం అందజేత

ధరూర్: గ్రామ పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు మంజూరు చేయాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం కార్మికులను గుర్తించి వత్తిలు లేకుండా మంజూరు చేయాలని కోరారు.

కొనసాగుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె

గద్వాలటౌన్: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు వేరువేరుగా సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

మహాసభలను విజయవంతం చేయండి

శాంతినగర్: గ్రామ పంచాయతీ వర్కర్స్ జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కార్తీక్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ అంబేడ్కర్ చౌరస్తాలో మహాసభల పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న గద్వాల జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవనంలో మహాసభలు జరుగుతాయని, పంచాయతీ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హలీం పాషా, శ్రీనివాసులు, తిమ్మప్ప, పెద్దయ్య, దేవన్న, మద్దిలేటి, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయటే.. విక్రయాలు



రాజోళి రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

- రూ.2 కోట్లు మంజూరైనా పూర్తికాని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు
- రాజోళి, రాయచూర్ రోడ్డుపైనే క్రయ విక్రయాలు
- మార్కెట్ సముదాయం నిర్మించాలని పట్టణ ప్రజల డిమాండ్

శాంతినగర్: గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినా పట్టణ వాసులకు, వ్యాపారులకు తిప్పలు తప్పడంలేదు. ఆరుబయట రోడ్లపై కూరగాయలు, మాంసాహార దుకాణాలు నిర్వహిస్తుండటంతో పట్టణ ప్రజలేగాక పల్లెటూరి వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దుమ్ము, ధూళి సోకిన ఆహార పదార్థాలు తింటూ పట్టణ వాసులు అనారోగ్యాల పాలవుతున్నారు. వడ్డేపల్లి గతంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉండేది. నాలుగేళ్ల క్రితం మున్సిపాలిటీగా రూపుదిద్దుకుంది. మున్సిపాలిటీగా ఏర్పడటంతో వడ్డేపల్లి, శాంతినగర్‌లతో పాటు పైపాడు ఎన్నో విధాలా అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశించారు. అందుకు భిన్నంగా ప్రస్తుత పరిస్థితి ఉంది. రెండేళ్ల క్రితం ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. 38 దుకాణాలతో సామూహిక మార్కెట్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఏడాదిన్నర లోపు పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. దుకాణ సముదాయం పూర్తయితే అటు వ్యాపారులకు, ఇటు ప్రజలకు బాగుంటుంది. పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ పిల్లర్లు వేసి బేస్‌మేట్‌తో నిలిపేశాడు. దీంతో అధికారులు ఎస్టిమేషన్ మరో రూ.50 లక్షలకు అదనంగా పెంచి మొత్తం రూ.2 కోట్లు చేశారు. అయినప్పటికీ ఏడాది కాలంగా పనులు సాగడం లేదు. అయిజలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రజలకు ఉపయోగంలోకి వచ్చిందని, వడ్డేపల్లి మార్కెట్‌ను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపైనే క్రయ, విక్రయాలు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తవకపోవడంతో మటన్, చికెన్, చేపలు, కూరగాయలు, ఆకుకూరల వ్యాపారులు రోడ్లపైనే క్రయ విక్రయాలు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. మామూలు రోజుల్లో కాకుండా శుక్రవారం శాంతినగర్ సంత రోజు పట్టణ వాసులు, ప్రజల కష్టాలు చెప్పనవసరం లేదు. విధిలేని పరిస్థితుల్లో ప్రజలు వాటిని కొనుగోళు చేస్తూ అనారోగ్యాల పాలవుతున్నారు.

ట్రాఫిక్ సమస్యతో..

మార్కెట్ సముదాయం పనులు పూర్తవకపోవడంతో రోడ్లపై ఆహార పదార్థాలతో పాటు వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు, దుస్తులు, చెప్పులు, పండ్లు, పూలు, పశువులకు అవసరమైన తాళ్లు, ఎలక్ట్రిక్ వస్తువులు రోడ్లపైనే విక్రయాలు జరుపుతుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, కాలినడకన శుక్రవారం రోజు బయటకు వెళ్లలేని పరిస్థితులు ఉంటాయని వాపోతున్నారు.

తెలిసినా తప్పడం లేదు..



మాంసాహారం, కూరగాయలు, ఆకుకూరల విక్రయాలు రోడ్డు పక్కల జరపడంతో దుమ్ము, ధూళి పడుతుందని తెలిసినా కొనుగోలు చేయక తప్పడం లేదు. ఏడాది కాలంగా మార్కెట్ కోసం ఎదురుచూస్తున్నాం. తొందరగా మార్కెట్ సముదాయాన్ని పూర్తి చేసి ప్రజలు అనారోగ్యాల పాలవకుండా చర్యలు తీసుకోవాలి. – యుగంధర్ రెడ్డి, శాంతినగర్

విక్రయాలకు ఇబ్బందులే..



మేము పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి తిప్పలు తప్పడంలేదు. రోడ్డు సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్‌లో స్థలం తక్కువగా ఉండటంతో రోడ్డు పైన సంచులు వేసుకోవాల్సి వస్తోంది. ట్రాఫిక్‌కు సమస్య వల్ల వేలం పాట తొందరగా ముగించడం వల్ల నష్టం వాటిల్లుతోంది. మార్కెట్ సముదాయాన్ని నిర్మించి సమస్య పరిష్కరించాలి. – శ్రీరాములు, కూరగాయల రైతు, బుడమర్సు

నిధులు లేక నిలిచిపోయాయి..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులు చేపట్టి 45 శాతం వరకు పూర్తి చేశాడు. గతంలో రూ.40 లక్షలకు బిల్లులు పెట్టాం, బిల్లు రాలేదు. బిల్లు వచ్చిన వెంటనే కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచి త్వరితగతిన పనులు పూర్తి చేయించి ప్రజలకు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తాం. – రాజయ్య, కమిషనర్, వడ్డేపల్లి మున్సిపాలిటీ

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



ర్యాలంపాడులో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ సభ్యులు

అలంపూర్: అలంపూర్ మండలంలోని ర్యాలంపాడులో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు భూలక్ష్మీదేవి, కేంద్రం ఇన్‌చార్జి రజియాబీలు కొబ్బరికాయలు కొట్టి కేంద్రాన్ని ప్రారంభించారు. ర్యాలంపాడు, జిల్లెలపాడు, సుల్తానాపురం గ్రామాలను కలిపి ఇక్కడ కొనుగోలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుక ఏ–గ్రేడ్ రూ. 2320, సాధారణ రకం క్వింటాలుకు రూ.2300గా ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వం క్వింటాలుకు అదనంగా బోనస్ రూ.500 అందజేస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రంలోని నిబంధనల మేరకు ధాన్యం తీసుకరావాలని కోరారు. రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ గ్రామ మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు దేవకర్ల, కోశాధికారి భానుబీ, ఆపరేటర్ రామేశ్వరి, ఏఈఓ నవీన్ కుమార్, రైతులు తదితరులు ఉన్నారు.

ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనల నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జనవరి నుంచి బ్యాంకు శాఖల విభజన

రాజోళి: జనవరి 2025 ఒకటవ తేదీ నుంచి ఏపీజీవీబీ బ్యాంకు శాఖలు విభజన అవుతాయని మండలంలోని మాన్‌దొడ్డి శాఖ బ్యాంకు మేనేజర్ రామ్ కుమార్ బుక్యా తెలిపారు. శుక్రవారం పెద్ద ధన్వాడ గ్రామంలో బ్యాంకు సేవలపై నిర్వహించిన కార్యక్రమంతో పాటు, మాన్‌దొడ్డిలోని బ్యాంకులో వినియోగదారులతో ఆయన మాట్లాడారు. తెలంగాణలో, ఏపీలో శాఖలు విభజన కావడంతో పాటు భారత ప్రభుత్వం ఆర్థిక శాఖ జారీ చేసిన లేఖ ప్రకారం తెలంగాణలోని 493 శాఖలు తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ)లో విలీనం అవుతున్నాయని తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏటీఎం సేవల్లో సాంకేతిక సమస్యలు ఉండటంతో పాటు, సేవలు నిలిచే అవకాశముందని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.ఈ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యాంకు లావాదేవీలు ముందుగానే జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వినియోగదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న ఏపీజీవీబీ మాన్‌దొడ్డి శాఖ బ్యాంకు మేనేజర్

క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలి



ధరూరు: ప్రతి క్రీడాకారుడు తమలో దాగి ఉన్న ప్రతిభను, నైపుణ్యాన్ని కనబరచాలని కాంగ్రెస్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని గ్రామ యువకులు ఏర్పాటు చేసిన డీపీఎల్ (ధరూరు ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోవిందు, సురేష్, రాజు,అఖిల్, దర్శెల్లి, గణేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్



అయిజలో బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

అయిజ: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమంగా కేసు నమోదు చేశారని నినాదాలు చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం మున్సిపాలిటీలోని తెలంగాణ తల్లి విగ్రహంవద్ద నిరసన చేపట్టారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయినవారిలో పల్లయ్య, ఆంజనేయులు, మత్తాలి, వీరేష్, మాధవ్, రఫీ, అల్తాఫ్, రాజు, నరేష్, పరుశరాముడు, నరసింహులు ఉన్నారు.

విద్యార్థులకు మెడిటేషన్ క్లాసులు



మెడిటేషన్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు మెడిటేషన్ క్లాసులు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశానుసారం 90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మెడిటేషన్ శిక్షకులు బాలస్వామి, రాకేష్‌లు విద్యార్థులకు మెడిటేషన్ గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాములు, ఉపన్యాసకుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన నిరసన దీక్ష

గద్వాల క్రైం: గద్వాల జిల్లా కోర్టు సముదాయాలను పీజేపీ క్యాంపు ప్రభుత్వ స్థలంలోనే స్థలం కేటాయించాలని గద్వాల బార్ అసోషియేషన్ సభ్యులు గద్వాల కోర్టు బయట చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. వారికి మద్దతుగా బీజేపీ నాయకులు శివారెడ్డి, రామచంద్రారెడ్డిలు సంఘీభావం తెలిపి మాట్లాడారు. దీక్షలో రాఘురామిరెడ్డి, వెంకట్రాదిరెడ్డి, రమేష్, విజయ్‌కుమార్, మురళీ, ఆయా పార్టీలకు చెందిన నాయకులు తదితరులు ఉన్నారు.

తప్పిన ప్రమాదం

గద్వాల క్రైం: ఓ మైనర్ కారును ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఎదురుగా ఉన్న కారు, స్కూటీ, స్తంభాన్ని ఢీ కొట్టిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఇటిక్యాల మండలానికి చెందిన కారును ఓ మైనర్ పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీ వైపు వేగంతో నడిపాడు. ఈ క్రమంలో ప్రైవేటు పాఠశాల సమీపంలో ఇంటి ముందు పార్క్ చేసిన కారును, స్కూటీని ఢీ కొట్టాడు. అంతటితో ఆగక కేబుల్ వైర్ స్తంభాన్ని ఢీ కొన్ని ఆగిపోయింది. దీన్ని గమనించిన స్థానికులు కారు వద్దకు వెళ్లగా, డ్రైవింగ్ చేసింది మైనర్‌గా గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మైనర్, కారు యజమాని బజారన్న హౌసింగ్ బోర్డు కాలనీలో జిల్లా గంథాలయ చైర్మన్ శ్రీనివాస్ ఇంటికి పని నిమిత్తం వచ్చారు. ఈ క్రమంలో మైనర్ కారును బయటకు తీశాడు. కారును స్పీడ్‌గా నడపడం, బ్రేక్‌లు వేసే క్రమంలో ఎక్స్‌లేటర్‌ను తొక్కడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఫార్చునర్ కారు, స్కూటీ పాక్షికంగా దెబ్బ తిన్నాయి. ప్రమాదానికి గురైన కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. దెబ్బతిన్న వాహనాల మరమ్మతు కారు యజమాని చేయిస్తానని చెప్పడంతో శాంతించారు. ఈ ప్రమాదంపై పోలీసులను సంప్రదించగా ప్రమాదం జరిగిన సంఘటనపై విచారణ చేస్తామన్నారు. మైనర్ కావడంతో పలువురు మందలించారు.



ప్రమాదానికి కారణమైన కారు

మాచర్లలో ఆధ్యాత్మిక శోభ



మాచర్లలో కొనసాగుతున్న గురుపూజ కార్యక్రమం

గట్టు: మాచర్లలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భజనలు, భక్తి గీతాలు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తుల ఊరేగింపుతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శ్రీ సద్గురు పూర్ణానందచంద్రశేఖరార్యుల 25వ వార్షిక పాదుక పూజా సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి వాతావరణం నెలకొంది. ప్రతి ఏటా మాచర్లలో అచల గురుభక్త బృందం ఆధ్వర్యంలో పాదుక పూజా వైభవంగా నిర్వహిస్తుంటారు. ఉదయం మందిర అలంకరణ, లఘు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం మంతా గురుమూర్తి, వేణుగోపాలస్వామిచే గీతాపారాయణం నిర్వహించారు. అనంతరం నగర సంకీర్తనలో భాగంగా భక్తులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం జెండావిష్కరణ నిర్వహించారు. అనంతరం పూర్ణానంద చంద్రశేఖర్ ప్రభువుల, వారి కుటుంబ సభ్యుల, శిష్య బృందంతో షోడషోపచార మహాపూజ నిర్వహించారు. భక్తులకు తీర్థ,ప్రసాదాల వితరణను చేశారు. కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటుగా కర్ణాటక ప్రాంతంలోని వివిధ జిల్లాలకు చెందిన పండితులు, భకుక్తుల పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నిర్వహన కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్‌తో పాటుగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనం



అలంపూర్‌లో కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



ధరూరు వైఎస్సార్ చౌరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

అలంపూర్: భారత రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిపోగు ప్రేమదాసు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులు డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సామాజిక, ప్రజా సంఘాల అధ్వర్యంలో కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ప్రజల మనోభావాలను అవమానించేలా ఉన్నాయన్నారు. పార్లమెంటు సభ్యత్వం రద్దుచేసి అమిత్ షాపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. భారత రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న దాడిని ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు నరసింహ, జగ్జీవన్, అయ్యస్వామి, పుల్లన్న, జయన్న, శ్రీను, బాబు, మాలిక్ బాషా, దావీదు, రవి, చిన్న రాముడు ఉన్నారు.

- ధరూర్ మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మను సీపీఎం ఆధ్వర్యంలో దహనం చేశారు. అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వినయ్, నర్సింహ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కర్రెప్ప, హుజూరప్ప పాల్గొన్నారు.
- అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ను అవమానించడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్ కుమార్ అన్నారు. రాజోళి మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టారు.కార్యక్రమంలో ఆనంద్ బాబు, లక్ష్మన్న, పౌలు,నర్సింహులు, శ్రీను తదిదరులు పాల్గొన్నారు.
- ఉండవెల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను పాఠశాలకు పంపించాలి

మల్దకల్: పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరిని తల్లిదండ్రులు పాఠశాలకు పంపించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ అన్నారు. శుక్రవారం మల్దకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతూ గైర్హాజరైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పాఠశాలకు వచ్చే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తహసీల్దార్ జుబేర్ మొయినుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, నాగేశ్వరరావు, రాజేశ్వర్‌రెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



మల్దకల్‌లో బడి మానేసిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

మౌలిక వసతులు కల్పించండి



మున్సిపల్ మేనేజర్ అశోక్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

అయిజ: మున్సిపాలిటీలోని 2వ వార్డులో ఉన్న కోట్ల వీధి ప్రజలకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్ అశోక్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారి కాలనీలో గతంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్డి శిథిలమైందని, దాని వల్ల మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు చాలామంది ఇండ్ల వద్ద స్థలాలు లేవని, అధికారులు ఆదునిక సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు.

ఆరగిద్దలో ఇంటింటా సర్వే



గట్టు: మండలంలోని ఆరగిద్ద గ్రామంలో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా స్పెషల్ ఆఫీసర్ అజీంబేగ్ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేశారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో ప్రత్యేక అధికారి ద్వారా గుర్తింపు కార్యక్రమాన్ని చేపట్టారు. పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు పటేల్ మధుసూదన్‌రెడ్డి తో పాటుగా గ్రామస్తులు సర్వేలో పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేస్తాం



రైతులకు సూచనలు చేస్తున్న మధుసూదన్ రెడ్డి

అయిజ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేస్తామని సింగిల్‌విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్న తాండ్రపాడులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో అధ్యక్షుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకాలం గన్నీ బ్యాగులు అవసరమైన మేరకు అందుబాటులో లేక పోవడంతో వరిధాన్యం కొనుగోలు ఆలస్యమైందన్నారు. సివిల్ సప్లైవారు గన్నీ బ్యాగులు సరిపడినన్ని అందజేశారని, రైతులు చింతించాల్సిన అవసరం లేదన్నారు. వరి కొనుగోలులో జాప్యం లేకుండా ఉండాలంటే తేమశాతం 17కు మించకుండా రైతులు చూసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



ఎంపికైన విద్యార్థిని చిన్నారి

అయిజ: మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన శేఖర్ కూతురు ఈడిగ చిన్నారి వడ్డేపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఈ విద్యార్థి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. కిష్టాపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పోషణ లోపాలను అధిగమించాలి

గట్టు: చిన్నారుల్లో పోషణ లోపాలను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని డీడబ్ల్యూఓ సునంద కోరారు. శుక్రవారం గట్టులోని రైతు వేదికలో పోషణ్ ట్రాక్, ఎన్‌హెచ్‌టీఎస్‌లపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్ల వారీగా డేటా నమోదు వివరాలు, సప్లిమెంటరీ న్యూట్రీషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, న్యూట్రీషన్ డేటాపై గ్రౌండ్ లెవల్ ఫిజికల్ డేటా కూడా సేకరించారు. పోషన్ ట్రాకర్ అప్లికేషన్ లాగిన్‌లో సమస్యలు, పరిష్కారంపై అవగాహన కల్పించారు. మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ హేమలత, పోషణ్ ట్రాక్ టీం సభ్యులు రఘు, కల్యాణ్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సంధ్యారాణి, వాసంతి పాల్గొన్నారు.